SK1 one NEWS HD

సమాజాభివృద్ధి కోసం మా అక్షర పోరాటం

RNI APTEL / 2018/76380

# సీమకిరణం

SEEMAKIRANAM TELUGU DAILY

ఎడిటర్ : యస్. నజీర్ అహ్మద్ బాషా

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : కర్నూలు, నెల్లూరు. | ఎడిటర్ : ఎస్. నజీర్ అహ్మద్ భాష | సంపుటి : 07 సంచిక : 332 | పేజిలు : 08, వెల రూ. 2 రూ/ | బుధవారం 04-02-2026

### 93 ఏళ్ల వయసులో 'మెట్రోమ్యాన్' కొత్త లక్ష్యం..

## కేరళ హైస్పీడ్ రైలుపై శ్రీధరన్ పట్టు



93 ఏళ్ల వయసులోనూ తగ్గని స్ఫూర్తితో 'మెట్రోమ్యాన్' శ్రీధరన్

కేరళ హైస్పీడ్ రైలు ప్రాజెక్టు కోసం కార్యాలయం ప్రారంభం

2లో

### ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణపై

# కవిత కీలక వ్యాఖ్యలు

- సిట్ పిలిస్తే విచారణకు వెళతానన్న జాగృతి అధ్యక్షురాలు
- విచారణ సుదీర్ఘంగా కొనసాగడంపై విమర్శలు
- త్వరగా పూర్తిచేసి దోషులను శిక్షించాలని డిమాండ్




హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను తొందరగా ముగించి దోషులకు శిక్ష పడేలా చేయాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సిట్ విచారిస్తున్న విషయం తెలిసిందే. ఈ కేసులో అధికారులకు మిగతా.. 2లో

# చైనా యుద్ధ ట్యాంకులు భారత్ సరిహద్దులను దాటాయి

- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై లోక్‌సభలో వాగ్వాదం
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ సభ్యుల నిరసన
- ఆర్మీ మాజీ చీఫ్ పుస్తకంలోని అంశాలను ప్రస్తావించిన రాహుల్ గాంధీ
- ప్రచురణ కాని పుస్తకంలోని అంశాల గురించి మాట్లాడవద్దన్న బీజేపీ



ఢిల్లీ: ఐదేళ్ల క్రితం నాటి డొక్లామ్ సరిహద్దు ఉద్రిక్తతల అంశాన్ని లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రస్తావించడంతో గందరగోళం ఏర్పడింది. చైనా యుద్ధ ట్యాంకులు భారత్ సరిహద్దులను దాటాయని రాహుల్ గాంధీ లోక్‌సభలో అన్నారు. ఆయన వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు నిరసన తెలిపారు. మిగతా.. 2లో



## నిడదవోలులో 3 ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపండి...

### కేంద్ర మంత్రికి పురందేశ్వరి విజ్ఞప్తి

కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరిన రాజమండ్రి ఎంపీ పురందేశ్వరి

జన్మభూమి, కోకనాడ, లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్‌ల నిలుపుదలకు వినతి

ప్రయాణికుల ఇబ్బందులను తొలగించి, రైల్వే ఆదాయం పెంచాలని సూచన

అమరావతి: ప్రయాణికుల సౌకర్యార్థం తూర్పు గోదావరి జిల్లా మిగతా.. 2లో

### ఏపీ, తెలంగాణలకు హైస్పీడ్ రైళ్లు గేమ్ ఛేంజర్..

### బెంగళూరుకు 2 గంటల్లో చేరుకోవచ్చు: అశ్వినీ వైష్ణవ్



తెలంగాణ, ఏపీ, తమిళనాడు మధ్య ఆర్థిక, హెల్త్ టూరిజం అభివృద్ధి చెందుతుందన్న కేంద్రమంత్రి

బడ్జెట్‌లో తెలంగాణలో రైల్వే పనులకు రూ.5,454 కోట్లు కేటాయింపు

2లో

### పసిడి ప్రియులకు శుభవార్త.. బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిలో పతనం!

తులం బంగారంపై ఒక్కరోజే రూ.9,050 పతనం



కిలో వెండిపై ఏకంగా రూ.50,000 తగ్గుదల

లాభాల స్వీకరణతోనే తగ్గుతున్నాయని అంచనా

2లో

# రాష్ట్రంలో హింసను ప్రేరేపించాలని చూస్తోంది..

## రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దు

- వైసీపీపై చంద్రబాబు ఫైర్
- అధికారం కోల్పోయామనే అసహనంతో రెచ్చగొట్టేందుకు యత్నం
- ఆ పార్టీ ట్రాప్ లో పడొద్దంటూ పార్టీ నేతలకు సూచన
- మంత్రులు, టీడీపీ సీనియర్ నేతలతో సీఎం టెలీకాన్ఫరెన్స్




అమరావతి: ఆంధ్రప్రదేశ్ లో అలజడి సృష్టించాలని, హింసను ప్రేరేపించాలని వైసీపీ ప్రయత్నిస్తోందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. ఇందులో భాగంగానే రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తోందని... ఆ ట్రాప్ లో పడొద్దని టీడీపీ నేతలకు ఆయన సూచించారు. ఈ మేరకు మంత్రులు, పార్టీ సీనియర్ నేతలతో ఆయన ఈ రోజు ఉదయం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారం కోల్పోయామనే అసహనంతోనే వైసీపీ రెచ్చగొట్టాలని చూస్తోందని చంద్రబాబు చెప్పారు. మిగతా.. 2లో

### ఇదేనా మీ రూల్ ఆఫ్ లా?

### కూటమి ప్రభుత్వంపై రోజా ఫైర్



2లో

- చంద్రబాబు ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా తీవ్ర విమర్శలు
- అధికారంలోకి రాగానే వైసీపీ నేతలపై దాడులు చేస్తున్నారని ఆరోపణ
- పలువురు మాజీ మంత్రులు, నేతల ఇళ్లపై దాడులు జరిగాయన్న రోజా
- ఇదేనా చంద్రబాబు చెప్పిన 'రూల్ ఆఫ్ లా' అని సూటి ప్రశ్న
- సాక్షి, డెక్కన్ క్రానికల్ కార్యాలయాలపైనా దాడులని వెల్లడి

# కేంద్ర ప్రభుత్వానికి ఆలోచనలు కరవయ్యాయి

- బడ్జెట్‌పై ఖర్గే విమర్శలు.. దీటుగా బదులిచ్చిన బీజేపీ
- ప్రభుత్వానికి విధానపరమైన దార్శనికత లోపించిందన్న ఖర్గే
- ప్రధాని మోదీకి వికసిత్ భారత్ పై స్పష్టమైన విజన్ ఉందన్న కమలం
- ఆర్థిక క్రమశిక్షణ, జాతీయ భద్రతకు బడ్జెట్‌లో ప్రాధాన్యమన్న బీజేపీ



ఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2026-27పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేసిన తీవ్ర విమర్శలకు బీజేపీ గట్టిగా బదులిచ్చింది. ప్రధాని మోదీ అభివృద్ధి అజెండాను, ప్రపంచ ఆర్థిక వాస్తవాలను కాంగ్రెస్ విస్మరిస్తోందని కమలం పార్టీ అధికార ప్రతినిధి ప్రతుల్ షా డియో మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రతుల్ షా మాట్లాడుతూ, మిగతా.. 2లో

### తెలంగాణకు అప్పుడే తాడిచెర్ల-

## 1 గనులు కేటాయించాం

2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు కేటాయించినట్లు వెల్లడి

రాజ్యసభలో ప్రశ్నోత్తరాల సమయంలో తాడిచెర్ల కోల్ బ్లాక్ గురించి స్పందించిన కేంద్రమంత్రి



బొగ్గు గనులను ప్రభుత్వరంగ సంస్థలకు కేటాయించడం లేదన్న తమిళనాడు ఎంపీ

ఢిల్లీ: తాడిచెర్ల-1 బొగ్గు గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. 2015 ఆగస్ట్ 31న తెలంగాణ విద్యుత్ సంస్థకు దీనిని కేటాయించినట్లు తెలిపింది. ఈ మేరకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి రాజ్యసభలో వెల్లడించారు. 2019 మార్చిలో ఉన్నత స్థాయి కమిటీ నివేదిక ఆమోదం అనంతరం, 2020 జూన్ నుంచి బొగ్గు గనుల కేటాయింపుల ప్రక్రియ మారినట్లు తెలిపారు. మిగతా.. 2లో




2లో

### ఇప్పుడు రేవంత్ రెడ్డికి సమాచారం ఎలా వస్తుందో, నాడు కేసీఆర్‌కు అలాగే వచ్చింది

- ఫోన్ ట్యాపింగ్ చేయాల్సిన అవసరం తమకు లేదన్న కేటీఆర్
- పరిస్థితి చూస్తుంటే మళ్లీ ఉద్యమం రోజులు గుర్తుకు వస్తున్నాయని వ్యాఖ్య
- ఫోన్ ట్యాపింగ్ కేసులో అబద్ధాలు ఒక్కటొక్కటి తేలిపోతున్నాయన్న కేటీఆర్

# నేరాలు చేస్తాం.. ప్రశ్నించవద్దంటే ఎలా?

"నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు

నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు




హైదరాబాద్: రావి నారాయణరెడ్డి స్ఫూర్తితో తాము పనిచేస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. అమరవీరుల స్మారక ట్రస్టు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రావి నారాయణరెడ్డి పురస్కారాన్ని జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి సీఎం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "నిజాం పాలకులకు వ్యతిరేకంగా రావి నారాయణరెడ్డి పోరాటం చేశారు. నాడు ప్రజల కష్టాలు, రాచరిక పోకడలు, అరాచక చర్యలపై పోరాడారు. 500 ఎకరాల భూమిని పేదలకు పంచి ఆదర్శంగా నిలిచారు. స్వేచ్ఛను హరించి, హక్కులకు భంగం కలిగిస్తే తిరుగుబాటు వస్తుంది. ప్రజల తిరుగుబాటు సాయుధ పోరాటంగా మారుతుందని ఆయన చాటి చెప్పారు. 60 ఏళ్లు వచ్చేసరికి రాజకీయ పదవీ విరమణ చేసిన గొప్ప నాయకుడు రావి నారాయణరెడ్డి. ప్రజల నుంచి తిరస్కారం పొందినా.. నేటి నేతలకు పదవీ వ్యామోహం పోవడం లేదు. తెలంగాణలో పదవులన్నీ కేసీఆర్ కుటుంబం అనుభవించింది. వందల ఎకరాల ఫామ్‌హౌస్‌లు, వేల కోట్ల వ్యాపారాలు మీకెలా వచ్చాయి..? బీఆర్ఎస్ నేతలు చేయాల్సిన తప్పులన్నీ చేశారు. నేరాలు చేస్తాం.. పశ్నించవద్దని మీరెలా అంటారు? అక్రమ మార్గాలు ఎంచుకున్నప్పుడు ప్రజాస్వామ్యబద్ధంగా విచారణ తప్పదు" అని సీఎం స్పష్టం చేశారు. రావి నారాయణ రెడ్డి నేషనల్ అవార్డు పొందడం ఎంతో గొప్పదిగా భావిస్తానని అవార్డు గ్రహీత జస్టిస్ సుదర్శన్ రెడ్డి అన్నారు. రావి నారాయణ రెడ్డి నిత్య చైతన్య స్ఫూర్తి అని కొనియాడారు. సొంత ఆస్తులను ప్రజలకు పంచిన మహానుభావుడని ప్రశంసించారు.

## మౌలిక వసతులు ఏర్పాట్లపై యాజమాన్య నిర్లక్ష్యం వద్దు

ఎస్సై నాగార్జున





**ప్యాపిలి ఫిబ్రవరి 03 (సీమ కిరణం ) :** స్థానిక పెట్రోల్ బంక్ లను ఎస్సై నాగార్జున తనిఖీ చేశారు. మంగళవారం ఎస్సై నాగార్జున మాట్లాడుతూ. పెట్రోల్ బంక్ ల్లో మౌలిక వసతులు ఏర్పాటు పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం కొనసాగుతున్నట్లు తెలిపారు. ఆయన తమ సిబ్బందితో ఇండియన్ పెట్రోల్ బంక్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి, మంచినీటి, ఉచిత గాలి, టాయిలెట్, ఫైర్ సేఫ్టీ, స్టాక్ ధర పట్టిక, కెమెరాలు వంటి సౌకర్యాలు లేకపోవడం గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరగకూడదని, తప్పనిసరిగా నియమాలు పాటించాలని హెచ్చరించారు.

## వైసీపీ కార్యాలయంలో చలో పోతిరెడ్డిపాడు పోస్టర్ లు ఆవిష్కరణ




**డోన్ టౌన్, ఫిబ్రవరి 03,(సీమ కిరణం న్యూస్):** సీమకు హక్కుగా రావాల్సిన కృష్ణా జలాల వాటాకు ఇన్సూరెన్స్ లాంటి రాయలసీమ లిఫ్ట్ స్కీం పూర్తి చేయాలని ఫిబ్రవరి 5వ తేదీన చేపట్టబోతున్న ఛలో పోతిరెడ్డి పాడు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను డోన్ వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ రేగటి రాజశేఖర్ రెడ్డి ,డోన్ మండల అధ్యక్షుడు సోమేష్ యాదవ్ ,మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుస్సేన్ ,పార్టీ వ్యవసాయ విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి , ఆర్.ఇ రాజవర్ధన్ , కౌన్సిలర్ ఆర్ట్ రమణ ,మండల యూత్ అధ్యక్షుడు దొరపల్లె చిరంజీవి ,మల్యాల శ్రీనివాస్ ,క్వాలిటీ అబ్దుల్లా ,రమేష్ రెడ్డి ,వంశీ , తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయం ఉద్యోగుల పై సస్పెన్షన్ వేటు



**డోన్ టౌన్, ఫిబ్రవరి 03,(సీమ కిరణం న్యూస్):** ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను మరియు అధికారుల ఆదేశాలను నిర్లక్ష్యం చేస్తూ సచివాలయ ఉద్యోగులు వారి పనులను చేయనందుకు, సచివాలయాల్లో మరియు వారికి కేటాయించిన వార్డులలో ప్రజలకుఅందుబాటులో లేకపోవడం వల్ల ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు 8 మంది సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీలను సస్పెండ్ చేయడం జరిగిందని, ఇకపై ఎవరైనా వారి విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై సస్పెన్షన్ వేటు తప్పదని, సస్పెండ్ అయిన వారు వారికి కేటాయించిన సర్వేలను పూర్తి చేసిన ఎడల వారి సస్పెన్షన్ ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవడం జరుగునని, అలాగే ప్రతి సచివాలయంలో మునిసిపాలిటీకి సంబంధించిన ఒక రెగ్యులర్ ఉద్యోగి మరియు ఇద్దరు ఆర్పీలను సహాయార్థం నియమించడం జరిగిందని, ప్రభుత్వం ఇచ్చిన సర్వేలను తప్పక పూర్తి చేసి తీరుతామని మునిసిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు. సక్రమంగా పనులు చేయని సచివాలయం ఉద్యోగులకు ఛార్జ్ మెమోలు, షోకాజ్ నోటీసులను పలుమార్లు ఇవ్వడం జరిగిందని మార్పు లేని వారి పై సస్పెన్షన్ వేటు తప్పదని మునిసిపల్ కమిషనర్ హెచ్చరించారు.

## మాజీ మంత్రిని విమర్శించే ముందు నీ స్థాయి తెలుసుకో

వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి

మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి

**ప్యాపిలి ఫిబ్రవరి 03 (సీమ కిరణం న్యూస్) :** మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని విమర్శించే ముందు డి సి ఎం ఎస్ జిల్లా చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ తన స్థాయిని తెలుసుకోవాలని వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మెట్టు వెంకటేశ్వర రెడ్డి, వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ పోతుదొడ్డి కృష్ణమూర్తి, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు బోరెడ్డి రామచంద్రా రెడ్డి హితవు పలికారు. మంగళవారం వెంగళంపల్లి గ్రామంలో నిర్వహించిన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో వై నాగేశ్వరరావు యాదవ్ . మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ని పిట్ట కథల మాజీ మంత్రి అంటూ సంభోదించడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో వారు తప్పు పట్టారు. గత వైఎస్ఆర్సిపి హయాంలో డోన్ నియోజకవర్గం లో జరిగిన అభివృద్ధి ప్రజలకు బాగా తెలుసు అన్నారు. ఐదేళ్ల వైఎస్ఆర్సిపి పాలనలో రెండు సంవత్సరాలు కరోనాలో వెళ్లిపోగా కేవలం మూడు సంవత్సరాల లోనే కనివిని ఎరుగని అభివృద్ధి చేసిన ఘనత మాజీ మంత్రి బుగ్గనకే దక్కుతుందని వారు అన్నారు. గోరకల్లు రిజర్వాయర్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందించ కార్యక్రమాన్ని, చెరువులకు నీరు నింపే కార్యక్రమాన్ని ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన సాధించిన ఘనతే అన్నారు. ఇవన్నీ తెలుసుకోకుండా నాగేశ్వరరావు తనకి ఇష్టం వచ్చినట్లు అవాకులు చవాకులు పేలితే సహించేది లేదన్నారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అప్పటి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలను నిర్మించి రైతుల వద్దకే పాలనను అందించారన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను రైతు సేవ కేంద్రాలుగా పేరు మార్చి వాటిని పూర్తిగా నిర్వీర్యం చేసిందన్నారు. డీసీఎంఎస్ జిల్లా చైర్మన్ గా ఉంటూ జిల్లా లో రైతులకు సమృద్ధిగా యూరియా అందించలేక అసమర్థతను చాటుకున్న ఘనత నాగేశ్వరరావు దే అన్నారు. ధాన్యం విక్రయించిన రైతన్నలు తమ ఖాతాలో డబ్బులు ఎప్పుడు జమ అవుతాయో తెలియక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా నాగేశ్వరరావుకు రైతు సమస్యలపై చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి రైతులకు ధాన్యము విక్రయించిన ధాన్యం సొమ్ము వారి ఖాతాల్లోకి జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

# రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ..









**నెల్లూరు ఆత్మకూరు ఏఎస్ పేట సీమకిరణం న్యూస్ :** ఏఎస్ పేట మండలం లోని వేల్పుల గుంట, జమ్మవరం గ్రామాలలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు రీ సర్వే జరిగిన భూములకు సంబంధించిన రైతులకు పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని మండల తహసిల్దార్ కె.అనిల్ కుమార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఆర్డీవో బి.పావని, రాష్ట్ర ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ వెల్ఫేర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టిడిపి కన్వీనర్ అబ్బూరి రమేష్ నాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేల్పుల గుంట గ్రామంలో సుమారు 1600 ఎకరాలకు సంబంధించి 222 పట్టాదారు పాసుపుస్తకాలు , జమ్మవరం గ్రామంలోని 302 పట్టాదారు పాస్ పుస్తకాలు ఆర్డీవో పావని , రాష్ట్ర డైరెక్టర్ అబ్బూరి రమేష్ నాయుడు చేతులమీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రి సర్వే జరిగిన గ్రామాలలో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఎలాంటి తప్పిదాలు లేకుండా రైతులు ఎలాంటి ఇబ్బందులకు పట్టాదారు పాస్ పుస్తకాలను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రమేష్ నాయుడు మాట్లాడుతూ రైతును రాజుగా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రైతుల ఆస్తులకు పూర్తి భద్రత కల్పించేందుకు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మీ భూమి మీ హక్కు ద్వారా రైతులకు సంపూర్ణ భూ యాజమాన్య హక్కులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి రైతులకు పూర్తి హక్కులతో రాజముద్రతో పట్టాదారు పాసుపుస్తకాలు అందించిన ఘనత కూటమి ప్రభుత్వం దేనిని పేర్కొన్నారు. నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో వేల్పులకుంట సర్పంచ్ పత్తిపాటి వెంగయ్య జమ్మవరం టిడిపి నాయకులు పైడి శ్రీనివాసులు వీఆర్వోలు చంద్రమౌళి కే నరేష్ ,కృష్ణ ప్రసాద్, హరి బాబు మండల సర్వేయర్ షేక్.అజిద్ గ్రామ రైతులు పాల్గొన్నారు.....

# రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ









చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేసిన రైతులు

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

డిసిఎంఎస్ చైర్మన్ వై. నాగేశ్వరరావు యాదవ్ మరియు

జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

**ప్యాపిలి ఫిబ్రవరి 03 (సీమ కిరణం న్యూస్ ) :** మండలం లోని వెంగళంపల్లె గ్రామంలో మీ భూమి -- మీ హక్కు కార్యక్రమం ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్య ప్రకాష్ రెడ్డి , వై. నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడం జరిగింది . అందులో భాగంగా ప్యాపిలి మండలంలోని వెంగళం పల్లె గ్రామంలో రి సర్వే ద్వారా పూర్తయిన రైతులకు డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలో కొత్త పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమం చేపట్టడంజరిగింది. పట్టాదారు పాసు పుస్తకాలు భూమి యాజమాన్యపు హక్కు పత్రాలు, గ్రామంలో ఎవరెవరికి ఎంతెంత భూమి ఉంది. ఏ సర్వే నంబర్లో ఉంది. ఆ వ్యక్తి ఎలా ఉంటాడు అనే వివరాలతో పట్టాదారుల ఫోటోలు అతికించి 1-బి రిజిస్టర్ను తయారు చేసి దానిని బట్టి తహసీల్దారు పట్టాదారు పాసు పుస్తకాలు జారిచేసారు. 1-బి రిజిస్టర్ ను పూర్వం 10 (1) ఖాతాల రిజిస్టర్ అనేవారు. గ్రామంలోని ప్రభుత్వభూమిని మినహాయించి మొత్తం ప్రైవేటు భూమి ఈ పుస్తంలోకి లెక్కలోకి వస్తుంది. వ్యవసాయానికి ఉపయోగించే మొత్తం ప్రైవేటు భూమికి పట్టాదారు పాసు పుస్తకాలు ఆర్డీవో, తహసిల్దార్ భారతి జారిచేయడం చేశారు. గత ప్రభుత్వంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ఫోటోలు ఉన్న పాస్ పుస్తకాలు రద్దు చేసి, తెలుగుదేశం ప్రభుత్వం దాని స్థానంలో కొత్త రాజముద్రతో చట్టబద్ధ గుర్తింపు ఉన్న పాస్ పుస్తకాలు పంపిణీ చేయడం జరిగింది. పరదర్శకంగా రెవెన్యూ రికార్డులు పరిశీలించి భూమి యజమాన్యం పై స్పష్టత కల్పించరు. తహసిల్దార్ ఆధార్ మరియు భూమి వివరాలు పరిశీలించి అక్కడికక్కడే సవరణలు చేయడం జరుగుతుంది. చనిపోయిన రైతుల స్థానంలో వారి వారసులకు పాస్ పుస్తకాలు అందించడం జరుగుతుందని సందర్భంగా తెలియజేశారు. అలాగే మండలానికి చెరువుల ద్వారా నీటిని అందించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి, ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి మండలం రైతులు ఆనందం తో కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ప్యాపిలి ప్రాథమిక సహకార సంఘం ద్వారా రైతుల అభివృద్ధి కొరకు 52 లక్షల లోన్ చెక్కులను డీసీఎంఎస్ చైర్మన్ వై.నాగేశ్వరరావు యాదవ్ రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖాజా పీర్, సుదర్శన్ ,శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి,జైశీలమ్మా, శరణ్య , రాము ,వెంకటప్ప, టిడిపి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొనారు.

# రైతులకు రాజా ముద్ర పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ ఎమ్మెల్యే కోట్ల







**డోన్ టౌన్, ఫిబ్రవరి 03,(సీమ కిరణం న్యూస్):** మండలంలోని కొత్తకోట గ్రామంలో రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో భాగంగా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి పాల్గొని రైతు సంక్షేమంపై కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు నూతన పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ ఫోటోతో ముద్రించబడిన పాత పాసుపుస్తకాల్లో అనేక సాంకేతిక లోపాలు ఉండటంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటన్నింటినీ సరిదిద్దుతూ ఇప్పుడు పూర్తిగా పారదర్శకమైన విధానంలో నూతన పాసుపుస్తకాలను రూపొందించామని చెప్పారు.ఈ నూతన పట్టాదారు పాసుపుస్తకాలపై కేవలం ప్రభుత్వ రాజముద్రతో పాటు క్యూఆర్ కోడ్ మాత్రమే ఉంచడం ద్వారా ఎలాంటి రాజకీయ చిహ్నాలులేకుండారూపొందించామని, వెబ్ ల్యాండ్ డేటాతో అనుసంధానం చేయడం వల్ల భూమి వివరాలపై సంపూర్ణ నమ్మకాన్ని రైతులకు కల్పించనున్నాయని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన రాష్ట్రవ్యాప్తంగా 6,688 గ్రామాల్లోని సుమారు 21.80 లక్షల మంది రైతులకు ఈ పాసుపుస్తకాలను స్థానిక గ్రామ సభల ద్వారా రెవెన్యూ సిబ్బంది అందజేయనున్నారని తెలిపారు. ఈ ప్రక్రియ మొత్తం పర్యవేక్షణతో, నిబంధనలకు అనుగుణంగా అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు.రైతుల భూమి హక్కులను కాపాడడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి మరిన్ని సంస్కరణలు తీసుకురావడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు,కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# పశు వసతి గృహాలకు స్థల సేకరణ చేపట్టాలి

జంతువుల జనన నియంత్రణ చర్యలు అత్యవసరం

వీధి శునకాలకు వాక్సినేషన్, స్టెరిలైజేషన్ తప్పనిసరి

అక్రమ గోవధశాలలపై కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా






**నంద్యాల ప్రతినిధి ఫిబ్రవరి 03 (సీమ కిరణం న్యూస్):** జిల్లాలో ప్రమాదాల వల్ల గాయపడిన జంతువుల సంరక్షణ కోసం అవసరమైన పశు వసతి గృహాల ఏర్పాటుకు తగిన స్థల సేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా జంతు సంరక్షణ చట్టం కింద ఏర్పాటైన డిస్ట్రిక్ట్ సొసైటీ ఫర్ ప్రివెన్షన్ ఆఫ్ క్రూయెల్టీ టు యానిమల్స్ (డీఎస్పీసీఏ) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి గోవింద నాయక్, మున్సిపల్ కమిషనర్ శేషన్న, డిపిఓ లలితాబాయి, డిఈఓ జనార్దన్ రెడ్డి, జంతు సంరక్షణ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, అఖిల, బసవరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పశువుల ఆహార సరఫరా, గోశాలల నిర్వహణ, వీధి శునకుల నియంత్రణకు అవసరమైన నిధుల సమీకరణపై సమగ్ర, వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో సుమారు 30 వేల వీధి కుక్కలు ఉన్నాయని, వీటి కారణంగా నందికొట్కూరు, బనగానపల్లె, బేతంచర్ల మండలాల్లో కుక్కల కాటుతో చిన్నారులు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జంతువుల జనన నియంత్రణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని, ముఖ్యంగా వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ మరియు వాక్సినేషన్ కార్యక్రమాలు నిరంతరంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జంతు సంరక్షణ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, అఖిల మాట్లాడుతూ, వాక్సినేషన్ కోసం పట్టుకున్న కుక్కలను తిరిగి అదే వీధిలో వదిలేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే స్టెరిలైజేషన్ గన్స్ వినియోగం, వాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయడం, అక్రమ గోవధశాలల నిర్మూలన దిశగా కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, అక్రమ కార్యకలాపాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిటీ సభ్యుడు బసవరాజు మాట్లాడుతూ, నంద్యాల పట్టణంలో వివిధ ప్రాంతాల్లో అక్రమ గోవధ మరియు నందుల వధశాలలు కొనసాగుతున్నాయని తెలిపారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీనగర్ నుంచి రైల్వే లైన్ వరకు ప్రతి శనివారం ఉదయం ఐదు అక్రమ వధశాలలు పనిచేస్తున్నాయని, రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో జోసెఫ్ కాన్వెంట్ సమీపంలో ప్రతి శనివారం రాత్రి అక్రమ గోవధ జరుగుతోందని వివరించారు. అలాగే ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని నడిగడ్డ ప్రాంతంలో సుమారు 12 అక్రమ వధశాలల్లో గర్భంతో ఉన్న గోవులను కూడా బహిరంగంగానే వధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చాంద్ బాడ ప్రాంతంలో రోజూ రోడ్డుపై గోమాంసం విక్రయం జరుగుతోందని, ఆంజనేయ స్వామి ఆలయం సమీపంలో, ప్రభుత్వ ఆసుపత్రి పక్కన, పెద్ద కూరగాయల మార్కెట్ వద్ద కూడా అక్రమ వధశాలలు కొనసాగుతున్నాయని, వీటిపై తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ను కోరారు. స్వయంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతకుముందు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జంతు సంరక్షణ చట్టం కింద ఏర్పడిన కమిటీ యొక్క నియమ నిబంధనలు, విధి నిర్వహణ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సభ్యులకు వివరించారు.

## వాతావరణ పర్యవేక్షణకు


# ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు

జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



**కర్నూలు ప్రతినిధి ఫిబ్రవరి 03 (సీమకిరణం న్యూస్) :** ఖచ్చితమైన, రియల్ టైమ్ వాతావరణ పర్యవేక్షణ కోసం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు నిరంతర డేటాను అందిస్తాయని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. మంగళవారం ఓర్వకల్లు మండలం నన్నూరు గ్రామంలోని ఏపీ ట్రాన్స్ కో కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాన్ని (ఏడబ్ల్యూఎస్) కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం ఆటోమేటిక్ వాతావరణ కేంద్రాలు ఆర్టీజిఎస్ కు అనుసంధానం అయ్యాయన్నారు. ఈ కేంద్రం ద్వారా వర్షపాతం, నేలలో తేమ, వాతావరణ పీడనం, గాలి, ఉష్ణోగ్రత వంటి వివరాలు ఆటోమేటిక్ గా ఆన్లైన్ లో నమోదు అవుతాయని తెలిపారు. తుఫాను లాంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడానికి, వ్యవసాయ ప్రణాళికలు రూపొందించడానికి సంబంధిత వాతావరణ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కేంద్రానికి సంబంధించిన యంత్రాల నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని, ఏవైనా సాంకేతిక సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సిపిఓ భారతి, డివైఎస్ఓ భాస్కర్, రామాంజనేయులు, ఏ ఎస్ ఓ సరళ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

# అమ్మాయీ ఈ రెక్కలున్నాయా..?!



మహిళంటే ఆకాశంలో సగం.. అవకాశాల్లో సగం.. ఇవన్నీ పాత ముచ్చట్లు! నేటి మహిళ అంటే ఓ గేమ్‌చేంజర్. పాలసీ డిసైడర్. అమ్మగా లాలించడమూ తెలుసు.. అమ్మోరులా చెండాడటమూ తెలుసు! ఆమె సమర్థతకు అధికారం తోడైతే.. అద్భుతాలు ఆవిష్కృతం అవుతాయని నిరూపిస్తున్న వారెందరో! అటువంటి మహిళామూర్తులకు 'జిందగీ' తరపున మహిళా దినోత్సవ శుభాకాంక్షలు. ఈ సందర్భంగా ప్రజారక్షణ విభాగంలో పనిచేసిన కొందరి విజయ వీరగాథలు మీకోసం. గువ్వలా ఎగరాలనీ నింగిని తాకాలనీ ఆశపడే ఆడపిల్లలెందరో. చదువులో ర్యాంకులు, కళాశాలలో పట్టాలు మొట్టమొదట ఒడిసి పట్టేదీ వాళ్లే. ముద్దార నేర్పిస్తే ముదితలు నేర్వలేని విద్య లేదని కవీంద్రులు చెప్పిన మాట అక్షర సత్యమే. అయితే జీవితం అన్నిటినీ ముద్దుగా నేర్పదు. పదేశాకే పరుగెలా పెట్టాలో చెబుతుంది. చిన్ననాటి ఆ విషయాన్ని పెద్దయ్యాక కూడా గుర్తుంచుకోవాలి. మనకెదురయ్యే సవాళ్లను ఒడుపుగా అధిగమించడం తెలుసుకోవాలి. విద్యాలయం బయటికొచ్చాక కావాల్సిన నైపుణ్యాలు వేరు. అవే బతుకు పోటీలో ర్యాంకుల్ని కట్టబెడతాయి. ఆకాశపుటంచులు అందుకొనేందుకు రెక్కలవుతాయి. ఎదగాలన్న కోరిక ఉన్న ఆడపిల్లగా, మరి మీకున్నాయా ఆ రెక్కలు!

### ధైర్యమే ఆభరణం

ఉద్యోగం, వ్యాపారం మనం ఎంచుకున్న వృత్తి ఏదైనా సరే పని చేసేటప్పుడు కాన్ఫిడెంట్‌గా కనిపించడం చాలా ముఖ్యం. అప్పుడే ఎదుటివారు మనల్ని నమ్మగలుగుతారు. మనం ఎంత సమర్థులమైనా సరే, అది మన మాటలో, హావభావాల్లో సుస్పష్టంగా కనిపించకపోతే మనం ఆ పనిలో విజయాన్ని సాధించడం కష్టమవుతుంది. ముఖ్యంగా ఆఫీసుల్లో పెద్ద ప్రాజెక్టులు, వ్యాపారాల్లో పెద్దమొత్తంలో సొమ్ములు మనచేతిలో పెట్టాలంటే మనం అందుకు తగ్గ మనిషిలా అనిపించాలి, అలాగే కనిపించాలి. అందుకు ముందుగా మనల్ని మనం నమ్మడం ముఖ్యం. మన సమర్థతకు మనమే కొన్ని పరీక్షలు పెట్టుకుంటూ వాటిని దాటుతూ వెళితే మన మీద మనకు భరోసా వస్తుంది. ఎన్ని పరీక్షలు ఎదుర్కొంటే అంత గట్టిపడతాం. అదే మనల్ని మరోమెట్టు ఎక్కేలా చేస్తుంది. అందుకే గడపదాటే ముందు తప్పనిసరిగా ధరించాల్సిన ఆభరణాల్లో ధైర్యాన్నీ చేర్చుకోవాలి.

### సామర్థ్యాలు పెంచుకోండి

పుస్తకం చదవాలంటే ముందు మనం అక్షరం నేర్వాలి. అలాగే వృత్తిలో రాణించాలంటే కొన్ని నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇంగ్లిష్ అవసరం అయినచోట దాన్ని స్పష్టంగా ఆత్మవిశ్వాసంతో మాట్లాడగలిగేలా సాధన చేయాలి. దానిమీద పట్టు సాధించాలి. మనమేంటో ఎదుటివాళ్లకు తెలియజేసేది మన మాటే. అందులో తడబడ్డామంటే ఎంత సబ్జెక్ట్ ఉన్నా అవతలి మనుషులకు అది తెలిసే అవకాశం లేదు. అలాగే చదువు పూర్తయ్యాక ఆఫీసులో పనిచేయడానికి కొన్ని కంప్యూటర్ లాంగ్వేజ్‌లు అవసరం అవుతాయి. కొన్ని ప్రాజెక్టులు పూర్తిచేయాల్సి ఉంటుంది. వాటిని ప్రాక్టికల్ పద్ధతిలో పూర్తిచేసి బయటికి వస్తే సులభంగా ఉద్యోగ వ్యాపారాల్లో రాణించవచ్చు. అక్కడి యుద్ధానికి ఇవే ప్రధానమైన ఆయుధాలు మరి!


### మార్పునకు సిద్ధంగా

ఎవరైనా కంఫర్ట్‌జోన్ నుంచి బయటికి రావడానికి అంతగా ఇష్టపడరు. కానీ దాన్నుంచి బయటపడి కాస్త రిస్క్ తీసుకోగలిగిన వాళ్లే విజయం సాధించిన వాళ్లలో ముందు ఉంటారన్నది తిరుగులేని నిజం. ఆడపిల్లలమంటూ అనవసరమైన అడ్డుగోడలు పెట్టుకోకుండా, కాస్త ముందుకువచ్చి పనుల్లో భాగస్వాముల కాగలిగితే ముఖ్యమైన వ్యక్తులుగా మీకు తప్పకుండా గుర్తింపు లభిస్తుంది. మనకు చేతగాని విషయాన్ని చూసి నేర్చుకోవడం, చేతనైన పనిని చొరవగా తీసుకోవడం రెండూ ఇక్కడ ముఖ్యమే. అలా కాకుండా, మనకు తెలిసిన పనిని కాస్త అలవాటైన చోటే ఉండి చేయాలనుకుంటే మనల్ని మనం ఎదుగుదలకు దూరం చేసుకున్నట్టే. ఇప్పుడు మీరు కూర్చున్న చోటు కూడా అంతకుముందు మీకు కొత్తదే అన్న విషయాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

### గాసిప్ ఓ నెగెటివ్


గాసిపింగ్ అన్నది ఓ నెగెటివ్ వైబ్రేషన్ అంటాడు 'గుడ్ వైబ్స్' పుస్తక రచయిత వెక్స్ కింగ్. ఒక మనిషిని చూస్తే లేదా వాళ్ల చుట్టుపక్కల ఉంటే ఎలాంటి అనుభూతి కలుగుతుంది అనేదే వైబ్ అన్నమాట. అక్కడ మంచి వైబ్ ఉంది బ్రో అని కొన్ని ప్రదేశాల గురించి చెప్పినా అదే అర్థం. మనం తినే ఆహారానికీ, మన ఆలోచనలకూ కూడా ఈ వైబ్ ఉంటుందంటాడు రచయిత. అందులో, గాసిప్.. అంటే ఒకరి గురించి లేనిపోనివి మాట్లాడుతూ ఉండటం, ప్రచారం చేయడంలాంటివి బ్యాడ్ వైబ్ లేదా నెగెటివ్ వైబ్ కిందికి వస్తుందంటాడు. నిజంగానే కూడా గాసిపింగ్ చేయడం అన్నది అస్సలు మంచి విషయం కాదు. వ్యక్తుల పరోక్షంలో వారి గురించి మాట్లాడటం ఆఫీసుల్లో ఒక్కొక్కసారి మనకు ఇబ్బందుల్నీ తెచ్చిపెట్టే అవకాశం ఉంది. నలుగురిలో మెదిలేటప్పుడు హుందాగా మన పని మనం చేసుకుపోవడమే తప్ప ఇలాంటి ప్రచారాల్లో తలదూర్చకపోవడమే మంచిది. ఒకవేళ అలాంటి సందర్భం ఎదురైనా తప్పించుకునే ప్రయత్నం చేయాలి. మన పై అధికారి లేదా సహచరులు మనల్ని ఇబ్బంది పెట్టేలా మాట్లాడితే నేరుగా వారితోనే దాన్ని చర్చించండి. అలా ఎందుకు మాట్లాడాల్సి వచ్చిందో కనుక్కొనే ప్రయత్నం చేయండి. మీ అభిప్రాయమూ చెప్పండి. అలా కాకుండా మీ ఫీలింగ్స్ ఇతరులతో పంచుకుంటే అది వక్రమార్గంలో వారికి చేరి, అపార్థం మరింత పెరిగే ప్రమాదం ఏర్పడుతుంది.

# సరైన సమయమిదే రాజీనామా చేయండి!




తెలంగాణలో గత ఏడాదిగా ప్రజల్లో, పత్రికల్లో, ప్రసార మాధ్యమాల్లో, న్యాయస్థానాల్లో నలుగుతున్న 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు వివాదం ఇంకా సాగదీయకుండా గౌరవప్రదంగా ముగించాలంటే ఆ పది మంది ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేయాలి. వెంటనే స్పీకర్ వాటిని ఆమోదించాలి. లేదా వారి సభ్యత్వాలను ఫిరాయింపు చట్టం కింద రద్దు చేయాలి. భారతదేశ చట్టసభల్లో ఫిరాయింపుల చరిత్రలో అత్యున్నత న్యాయస్థానం ఒక అసెంబ్లీ స్పీకర్ కాలాతీత నిర్ణయాధికారంపై ఇంతగా పదే పదే అసహనం వ్యక్తం చేయడం ఇదే తొలిసారి. రేవంత్ రెడ్డి పరిపాలన పట్ల పెల్లుబుకుతున్న ప్రజా వ్యతిరేకత నేపథ్యంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలు రాజీనామాలు చేసి ప్రజల ముందుకు వచ్చి ఉప ఎన్నికల్లో గెలిచే సాహసం చేయలేని దీనస్థితి దాపురించింది. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వారిని మరింత నిరాశకు గురిచేశాయి. మరోవైపు నెత్తిపై అనర్హత కత్తి వేలాడుతూనే ఉన్నది. వారి పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యి. భవిష్యత్తు అగమ్య గోచరమైన నేపథ్యంలో కొందరు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకోవడానికి రాయబారాలు నడుపుతున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. స్పీకర్ నిర్ణయం తీసుకోవడానికి తగిన సమయం అంటే ఎంతకాలం? దానికో పరిమితి, పద్ధతి లేదా? అని సర్వోన్నత న్యాయస్థానం పలుమార్లు ప్రశ్నిస్తున్నా బాధ్యులైన అసెంబ్లీ అధికారులు, వారి తరఫున వాదిస్తున్న దిగ్గజ న్యాయవాదులు రకరకాల సాంకేతిక అభ్యంతరాలను ముందుకుతెచ్చి కాలయాపన చేయడం ఆశ్చర్యం కలిగిస్తున్నది. శిరస్సు వంచి దేశం నమస్కరించవలసిన అత్యున్నత న్యాయస్థానంతో దోబూచులాడుతున్న వారి జిత్తులమారితనం అవగతమవుతున్నది. ఈ కేసు ద్వారా అత్యున్నత న్యాయస్థానం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించి, సత్సంప్రదాయాన్ని నెలకొల్పే దిశగా ఒక చారిత్రాత్మకమైన తీర్పునిస్తుందన్న ఆశాభావం ప్రజల్లో ప్రజాస్వామికవాదుల్లో వ్యక్తమవుతున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులుగా పోటీచేసి పార్టీ కార్యకర్తల కష్టంతో ప్రజల ఆమోదంతో గెలిచి వేలికంటించిన నల్ల సిరాచుక్క ఆరకముందే పోచారం శ్రీనివాసరెడ్డి, కడియం శ్రీహరి, దానం నాగేందర్, ఎం.సంజయ్‌కుమార్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, టి.ప్రకాశ్ గౌడ్, బండ్ల కృష్ణ మోహనరెడ్డి, తెల్లం వెంకట్రావు, కాలె యాదయ్య అధికార కాంగ్రెస్ పార్టీలో చేరిపోవడం, కండువాలు కప్పుకోవడం ప్రజలంతా చూశారు. స్పీకర్‌కు బీఆర్ఎస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. విచారణ వేగం పుంజుకొన్న తరుణంలో న్యాయస్థానం కళ్లు కప్పడం కోసం నేనింకా బీఆర్ఎస్ అని ఒకరు, కప్పింది కాంగ్రెస్ కండువా కాదు దేవాలయ శేష వస్త్రమని మరొకరు, అనుమతి లేకుండానే తన ఫొటోలు కాంగ్రెస్ ఫ్లెక్సీలలో ముద్రిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినదొకరు, ఎక్కడ వీడియోలో దొరికిపోతామోనన్న భయంతో గాంధీభవన్ సీఎల్పీ సమావేశాలకు దూరంగా ఉండేది ఒకరు, ఏకంగా కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీచేసి కూడా అంతా ఉత్తిదే అంటున్నది ఇంకొకరు. ప్రభుత్వ సలహాదారునైనా పార్టీ మారలేదని వేరొకరు ఇలా ఒకటా, రెండా? ఫిరాయింపు ఎమ్మెల్యేలు వేయని పిల్లి మొగ్గలు లేవు. గతంలో ఎన్నో పార్టీ ఫిరాయింపులు జరిగాయి. వైఎస్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వైపు వెళ్లినా కండువాలు కప్పుకోలేదు. పదవులు తీసుకోలేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చట్ట ప్రకారమే టీడీపీ, కాంగ్రెస్ శాసనసభాపక్షాలు బీఆర్ఎస్‌లో విలీనమయ్యాయి. కానీ, ఇంత నిస్సిగ్గుగా ఫిరాయింపు నాటకాలకు తెర తీసిన సందర్భం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన 39 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల్లో 26 మంది కాంగ్రెస్‌లో చేరి ఉంటే అది ఫిరాయింపు అయ్యేది కాదు. చట్ట ప్రకారం బీఆర్ఎస్ సభ్యులు కాంగ్రెస్‌లో విలీనమైనట్టుగా భావించేవారు. వివాదానికి ఆస్కారం ఉండేది కాదు. గేట్లు తెరిస్తే అది సాధ్యమేనని కాంగ్రెస్ కాకి లెక్కలు వేసుకున్నది. కానీ అతి కష్టం మీద చేరింది పదిమంది. ఫలితంగా కాంగ్రెస్ పార్టీ బోనులో నిలబడింది. 'బీఆర్ఎస్ పనైపోయింది. మిగిలింది మేమే' అని జబ్బలు చరుచుకుంటున్న కాంగ్రెస్, ప్రకటించిన పథకాలన్నీ తమ రాష్ట్రంలో అమలుపరుస్తున్నామంటూ పక్క రాష్ట్రాలలో ప్రవచనాలు వల్లిస్తున్న కాంగ్రెస్ పది మందితో రాజీనామా చేయించి ఎన్నికలకు పోయి ప్రజల తీర్పు కోరవచ్చు కదా? గెలిచి చూపించి ప్రభుత్వం పట్ల ప్రజామోదానికి అదే నిదర్శనమని ఢంకా బజాయించుకోవచ్చు కదా. ఒకవేళ పదిమందీ ఓడిపోయినా ప్రభుత్వానికి వచ్చే ఇబ్బందేమీ లేదు. న్యాయస్థానం ముందు తలవంచే పరిస్థితి రాదు. భయమెందుకు? ప్రధానిగా రాజీవ్‌గాంధీ తెచ్చిన పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టానికి ఈ 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అనుగుణంగానే ఉన్నదని ఆ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ ప్రకటించగలరా? ఐదేండ్ల కిందట చట్టబద్ధంగానే బీఆర్ఎస్‌లో చేరిన 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీ గేటు తాకనీయనని భీషణ ప్రతిజ్ఞ చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేడు చట్ట విరుద్ధంగా కాంగ్రెస్‌లో చేరిన ఈ 10 మందికి స్వాగత ద్వారాలు ఎలా తెరిచినట్టు? ఫిరాయింపులు మరింత విచ్చలవిడిగా జడలు విప్పకుండా కళ్లెం వేసే శక్తి ఒక న్యాయస్థానాలకే ఉన్నది. ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఓడిపోయిన అభ్యర్థి న్యాయస్థానాలను ఆశ్రయిస్తే అవును నిజమే అనే లోపు గెలిచిన అభ్యర్థి పదవీకాలం పూర్తయిన సందర్భాలున్నాయి. అలాగే స్పీకర్ కాలయాపన వల్ల ఫిరాయింపుదారులు పబ్బం గడుపుకొంటున్న సందర్భాలు చూస్తూ ఉన్నాం. స్పీకర్‌కు ఉన్న నిరపేక్షమైన విచక్షణాధికారాలపై మరింత చర్చ జరగాలి. స్పీకర్ నిర్ణయానికి తగిన సమయం కాదు, నిర్ణీత సమయం ఉండాలి. ఈ ద్రవిడ ప్రాణాయామాలు, డొంక తిరుగుడు వ్యవహారాలు వద్దనుకుంటే చట్టసభల సభ్యుడు ఫిరాయించిన రోజే సభ్యత్వం రద్దు కావాలి. అందుకు కేంద్రం చొరవ చూపాలి. ముక్తాయింపు గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ టికెట్ ఆశించిన పొన్నాల లక్ష్మయ్యను ఉద్దేశించి నాటి పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చాలా పరుషంగా మాట్లాడారు. 'ముసలితనానికి ఇదేం పో యేకాలం. పార్టీ నీకేం తక్కువ చేసింది. సిగ్గుండాలి' అంటూ తిట్టిపోశారు. బీఆర్ఎస్ నుంచి ఫిరాయించిన వయోధిక నాయకత్రయాన్ని అట్లాగే తిట్టిపోసి వెనక్కి పంపిస్తే రేవంత్ రెడ్డికి ఎంతో గౌరవం దక్కేది కదా.

# తెలంగాణ గెలువాలె.. మనం నిలువాలె



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మధ్య ఇటీవల జరిగిన భేటీ ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ భేటీ సందర్భంగా ఉక్రెయిన్‌ను లొంగదీసుకుని బేషరతుగా యుద్ధ విరమణకు జెలెన్‌స్కీని ట్రంప్‌తో పాటు అమెరికా ఉపాధ్యక్షుడు వాన్స్ ఒప్పించాలనుకున్నారు. కానీ, శాంతి చర్చలు అంటే యుద్ధం ఆపడం మాత్రమే కాదని జెలెన్‌స్కీ ఈ సందర్భంగా వారికి స్పష్టం చేశారు. యుద్ధం ఆపడం అంటే తమ హక్కులను కాపాడటమని, తమకు న్యాయం చేయడమని, తమ దేశ ప్రజలు సంతోషంగా ఉండటమని, అలాంటి శాంతిని తాము కోరుకుంటున్నామని ఆయన చెప్పారు. అంతేకాదు, ఆత్మగౌరవాన్ని చంపుకొని శాంతి చర్చలు జరపలేమని తెగేసి చెప్పారు. జెలెన్‌స్కీ మాటలు విన్న నాకు నాడు తెలంగాణ జరిపిన ఆత్మగౌరవ పోరు స్ఫురణకు వచ్చింది. తెలంగాణ అస్తిత్వంతో పాటు, జాతి ఆత్మగౌరవం కాపాడుకునేందుకు కేసీఆర్ చేసిన ఉద్యమం యాదికి వచ్చింది. అనేక సందర్భాలలో తెలంగాణ ఉద్యమం విడనాడాలని ఆనాటి ఆంధ్ర పాలక వర్గా లు, జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు ట్రం ప్ తదితరులు బెదిరించినట్టుగా.. కేసీఆర్ పైనా అనేక ఒత్తిళ్లు, బెదిరింపులకు, వెన్నుపోట్లకు పాల్పడినప్పటికీ, అదరక బెదరక మొక్కవోని ధైర్యంతో దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి వారందరినీ రాష్ట్రసాధనకై ఏకం చేసి మడమ తిప్పని ప్రజాస్వామిక యుద్ధం చేసి, ఢిల్లీ పాలక వర్గాల మెడలు వంచి తెలంగాణ సాధించిన ఆత్మ గౌరవ పోరాట యోధుడు కేసీఆర్. అయి తే, తెలంగాణ సాధనతోనే తన లక్ష్యం పూర్తయిందని అక్కడితో కేసీఆర్ ఆగిపోలేదు. సాధించిన తెలంగాణను అగ్రపథాన నిలబెట్టాలని సంకల్పించారు. అనుకున్నట్టే నిలబెట్టారు కూడా. తెలంగాణ వాళ్లకు పాలన చేతకాదని ఎవరైతే అవమానించా రో, వారి ముందే తెలంగాణను సగర్వంగా నిలబెట్టారు. ఈ గడ్డ మీద ప్రేమ ఉన్నప్పుడే ఇవన్నీ సాధ్యమవుతాయి. ఇటీవల తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ విస్తృతస్థాయి సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్.. ఏప్రిల్ చివర్లో జరగనున్న పార్టీ రజతోత్సవాలకు సంబంధించి నేతలు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం తాత్కాలికమైనదని, తెలంగాణ ప్రగతి, రాష్ట్ర ప్రజల అభ్యున్నతి శాశ్వతమని.. అదే బీఆర్ఎస్ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆ లక్ష్యాన్ని సాధించడం కోసం మనం అధికారంలో ఉండాలే గాని, పదవుల కోసం, అధికారాన్ని అనుభవించడం కోసం కాదని ఉద్బోధించారు. ముఖ్యంగా తెలంగాణను గెలిపించడం కోసం, తెలంగాణ ప్రజలను విజయతీరాలకు చేర్చడం కోసమే అధికారంలో ఉండాలని ఘంటాపథంగా తేల్చిచెప్పారు. తెలంగాణ ఆషామాషీగా ఏర్పడలేదు. తెలంగాణ ఏర్పాటు వెనుక బలమైన ప్రజా పోరాటం, విద్యార్థి ఉద్యమం, అమరవీరుల త్యాగాలు, ఆత్మ బలిదానాలు, వీటన్నింటి కంటే ముఖ్యంగా అందర్నీ ఏకతాటిపైకి తీసుకొచ్చి ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగసేలా చేసిన కేసీఆర్ కృషి ఉన్నది. నాడు ఆయన మొండిగా నిలబడకపోయి ఉంటే ఇప్పటికీ తెలంగాణ కల సాకారం అయ్యేది కాదు. అనేక కష్టనష్టాలకోర్చిన తర్వాత స్వరాష్ట్రం ఏర్పడింది. అందుకే పోట్లాడి సాధించుకున్న తెలంగాణను పట్టుదలతో కేసీఆర్ 10 ఏండ్ల పాటు అభివృద్ధి పథంలో నడిపించారు. తెలంగాణ సిద్ధించక ముందే స్వరాష్ట్రంలో సాధించాల్సిన ప్రగతి గురించి కేసీఆర్ మార్గదర్శకాలు రూపొందించారు. 2012లోనే కేజీ టు పీజీ ఉచిత విద్య అమలు గురించి ప్రస్తావించడమే అందుకు తార్కాణం. గురుకుల విద్యాలయాల విధివిధానాలకు సంబంధించి అప్పట్లో కేసీఆర్ చెప్పిన విషయాలు, ఆయన మదిలోని ఆలోచనలను నేనే స్వయంగా వందల పేజీల వరకు గ్రంథస్తం చేశాను. తెలంగాణ వస్తే పారిశ్రామిక విధానం ఎలా ఉంటుందనే విషయంపై 2011లోనే ఇండియా సీఈవో ఫోరం వాళ్లకు కేసీఆర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ వస్తే పారిశ్రామికంగా ఏ విధంగా ఎదుగుతుందనే విషయమై దేశంలోనే టాప్ కంపెనీల సీఈవోలకు సమగ్రంగా వివరించారు. తద్వారా తెలంగాణ ఏర్పడితే పరిశ్రమలు రావనే అనుమానాలను పటాపంచలు చేశారు. నాడు చెప్పినట్టే అధికారంలోకి వచ్చాక తెలంగాణను అభివృద్ధి చేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన పథకాల వెనుక ఒక లోతైన ఆలోచన, ఆర్ద్రత, ఒక అధ్యయనం, ఒక విజన్ ఉంటాయి. తెలంగాణ ఉద్యమ సమయంలో తెలంగాణ తల్లి, ధూంధాం, బతుకమ్మ, నమస్తే తెలంగాణ, టీ న్యూస్ లాంటి ఐదు పాశుపతాస్త్రాలను కేసీఆర్ తయారు చేసుకున్నారు. నాడు భారత స్వాతంత్ర్యోద్యమంలో చరఖా, ఖాదీని గాంధీజీ ఆయుధాలుగా చేసుకున్నట్టే.. వీటిని కేసీఆర్ ఆయుధాలుగా మలుచుకున్నారు. బతుకమ్మ పండుగను ఉద్యమ పండుగగా, మన అస్తిత్వ చిహ్నంగా మార్చేశారు. తెలంగాణ తల్లిని రూపుదిద్ది పల్లె పల్లెన ప్రతిష్ఠించి ప్రతి ఒక్కరిలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించారు. ఊరూరా ధూంధాం కార్యక్రమాలు ఏర్పా టు చేసి ప్రజల గుండెల్లో తెలంగాణ ఆకాంక్షను రగిలింపజేశారు. నమస్తే తెలంగాణ, టీ న్యూస్ మధ్యమాల ద్వారా తెలంగాణ వాణిని వినిపించారు. నాడు తెలంగాణ ఉద్యమానికి ఊపిరిపోసిన వీటన్నింటిపై నేడు రేవంత్ రెడ్డి కక్ష కట్టారు. గొంతు నులిమి చంపాలని చూస్తున్నారు. ఇప్పటికే తెలంగాణ అస్తిత్వ పతాకగా నిలిచే తెలంగాణ తల్లి రూపాన్ని మార్చేశారు. బతుకమ్మను కనుమరుగు చేయాలనే కుట్రతో కొత్త తెలంగాణ తల్లి చేతుల నుంచి తొలగించేశారు. ఈ నేపథ్యంలో మన అస్తిత్వాన్ని సంస్కృతిని కాపాడుకోవాలంటే రజతోత్సవాల వేదికగా వీటిని పునశ్చరణ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఈన కాచి నక్కల పాలైనట్టు.. అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణ.. విధ్వంసకారుడైన రేవంత్‌రెడ్డి చేతిలో పడి ఇబ్బందులు పడుతున్నది. రేవంత్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ అస్తిత్వంపై, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవంపై, ఆత్మాభిమానంపై, చిహ్నాలపై దాడి చేస్తున్నారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో 10 ఏండ్ల పాటు కడుపున పెట్టుకొని, కష్టనష్టాలకోర్చి సాధించుకున్న ప్రగతిని వెనక్కి నెడుతున్నారు. ఆకాశమే హద్దుగా నింగిలోకి దూసుకెళ్తున్న అభివృద్ధిని రేవంత్‌రెడ్డి అధఃపాతాళంలోకి తొ క్కుతున్నారు. మతిభ్రమించి కేసీఆర్‌ను నిందిస్తున్నారు. గురుకులాలు నెలకొల్పి పే దింటి బిడ్డల భవిష్యత్తును హిమాలయ శిఖరాలకు చేర్చిన కేసీఆర్ పై మంచి, మానవత్వం మరిచిన రేవంత్ రెడ్డి అక్కసు వెళ్లగకుతున్నారు. పారిశ్రామికీకరణ ద్వారా తె లంగాణను తీర్చిదిద్ది లక్షల మంది యువతకు ఉపాధి చూపిన కేసీఆర్ గురించి నోటికొచ్చినట్టు వాగుతున్నారు. ఈ ప్రాంతం పడ్డ కష్టాలను, ఈ గడ్డపై మమకారంతో కేసీఆర్ చేసిన కృషిని తలచుకోవాల్సిన సమయం ఇది. రేవంత్‌రెడ్డి చేతిలో ఆగమవుతున్న తెలంగాణను కాపాడుకునేందుకు మరో పోరాటానికి సమాజాన్ని సమాయత్తపర్చే అవసరమున్నది. అందుకు సరైన వేదిక రజతోత్సవాలు. తెలంగాణ విజయాల వెనుక ఉన్న కృషి, ఆర్ద్రత, విజన్, ఆలోచనలను రజతోత్సవాల వేదికగా తెలంగాణ సమాజానికి చెప్పుకోవాల్సిన అవసరం ఉన్నది. ప్రజల పోరాటం, తెలంగాణ కోసం పడ్డ కష్టనష్టాలు, అందర్నీ సమీకృతం చేసిన కేసీఆర్ కృషి, రాష్ట్రం సాధించాక జరిగిన అభివృద్ధి, ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో ప్రజలు పడుతున్న కష్టాలు తదితర అంశాలకు రజతోత్సవాలు ప్రతిబింబం కావాల్సిన అవసరం ఉన్నది. పరాయి పాలకుల చెర నుంచి తెలంగాణ తల్లిని రక్షించేందుకు కేసీఆర్ సలిపిన పోరాటాన్ని రజతోత్సవాల వేదికగా యాది చేసుకోవాలి. రేవంత్‌రెడ్డి పాలనలో కూలిపోతున్న మన తెలంగాణ కలల సౌధాన్ని అక్కడి నుంచే మళ్లీ నిర్మించుకోవాలి. తెలంగాణను మళ్లీ గెలిపించుకొని, మనమూ గెలవాలి.



# వీసా కావాలంటే సోషల్ మీడియా వివరాలు వెల్లడించాల్సిందే

## అమెరికా కొత్త నిబంధన

అమెరికా వీసా, గ్రీన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే భారతీయులు ఇమ్మిగ్రేషన్ దరఖాస్తులతోపాటు తమ సోషల్ మీడియా ఖాతాల సమాచారాన్ని కూడా ఇప్పుడు అందచేయాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్(డీహెచ్ఎస్) మార్చి 5న ఓ నోటీసులో వెల్లడించింది. గ్రీన్ కార్డులు, పౌరసత్వం, ఇతర ప్రయోజనాలు కోరుతూ దరఖాస్తు చేసుకునే భారతీయులు సహా ఏటా 35 లక్షల మందికిపైగా విదేశీయుల నుంచి ఈ సమాచారాన్ని కోరనున్నట్టు డీహెచ్ఎస్ ప్రకటించింది. ఇమ్మిగ్రేషన్ స్క్రీనింగ్‌ను కట్టుదిట్టం చేయాలన్న ఉద్దేశంతో ఈ ఏడాది జనవరిలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేసిన 14161 ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌లో భాగంగా ఈ ప్రతిపాదన ఉంది. కొత్త నిబంధన మేరకు దరఖాస్తుదారులు తొమ్మిది ప్రధాన ఇమ్మిగ్రేషన్ ఫారాలలో తమ సోషల్ మీడియా ఖాతాల వివరాలను అమెరికా సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్‌కు అందచేయవలసి ఉంటుంది. పాస్‌వర్డ్ తెలియచేయవలసిన అవసరం లేదు. ఈ సమాచారాన్ని దరఖాస్తుల గుర్తింపును తనిఖీ చేసేందుకు, జాతీయ భద్రతా ముప్పులను అంచనా వేసేందుకు ఉపయోగిస్తారు. భారతీయ ఇమ్మిగ్రెంట్లు ముఖ్యంగా స్టెమ్ ప్రొఫెషనల్స్, హెచ్-1బీ ఆశావహులు, ఈబీ-5 పెట్టుబడిదారులకు ఈ కొత్త నిబంధనతో నిఘా మరింత అధికమవుతుంది. సాధారణ ఆన్‌లైన్ సంభాషణలు కూడా సమీక్షకు గురవుతాయని ఇమ్మిగ్రేషన్ నిపుణులు హెచ్చరించారు. ఆన్‌లైన్‌లో వ్యక్తుల ప్రవర్తనపై నిఘా ఉంటుందని, పోస్టులు, కామెంట్లు, చాటింగ్‌లపై సమీక్ష ఉండే అవకాశం ఉందని వారు తెలిపారు.

Editor, Printed, Published and Owned by Shaik Nazeer Ahmed Basha , H.NO. 3-104- 2 , Balajinagar, Kurnool - 518006, (A.P) , Printed at GK PUBLICATIONS , D.NO.27/66, CHINNA MARKET, DIST. KURNOOL- 518001, ANDHRA PRADESH. E-mail : seemakiranamknl@gmail.com. RNI : APTEL / 2018/ 76380, Cell : 9133399830,8919971019. website : - www.seemaakiranam.com , www.seemakiranamnews.com , epaper.seemakiranamnews.com